క్లుప్తంగా

వేములదీవి వెంకన్నకు ప్రత్యేక పూజలు



నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి గ్రామం కాపులకొడపలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారికి ఏడు వారాల ప్రదిక్షణలు చేయడం, మొక్కులు చెల్లించి, తలనీలాలను సమర్పించే భక్తుల సంఖ్య పెరగడంతో ప్రధాన రహదారి మొత్తం మధ్యాహ్నం వరకూ భక్తులతో కిక్కిరిసిపోయింది. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు. సుమారు వెయ్యిమందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని నిర్వాహకులు తెలిపారు.

నేడు ఉచిత యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్

పెనుగొండ: ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉచిత యాంటీ రబిస్ వ్యాక్సినేషన్ నిర్వహించనున్నట్లు పెనుగొండ పశు సంవర్ధక శాఖ ఇన్‌చార్జి ఏడీ డాక్టర్ కంఠమని భాను తేజ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి పెనుగొండ ప్రాంతీయ పశు వైద్యశాలలో ఉచితంగా వ్యాక్సిన్ వేస్తామన్నారు. మండలంలోని అన్ని పశు వైద్యశాలలు, రైతుసేవా కేంద్రాల వద్ద సైతం వ్యాక్సిన్ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. పెంపుడు కుక్కల యజమానులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పాలకొల్లులో...

పాలకొల్లు సెంట్రల్: జంతువులతో మానవుని సహచర్యం ఎంతో ప్రాచీనమైనదని వెటర్నరీ సహాయ సంచాలకులు డాక్టర్ జి.సత్యనారాయణ తెలిపారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ పట్టణ వెటర్నరీ ఆసుపత్రిలో ఆదివారం ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా కుక్కలకు రేబిస్ నివారణా టీకాలు ఉచితంగా వేయనున్నట్లు తెలిపారు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకూ పెంపుడు కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు ఉచితంగా వేస్తామని స్పష్టం చేశారు.

దివ్యాంగులకు సదరం తిప్పలు

ఆకివీడు: దివ్యాంగుల ధ్రువీకరణ పత్రం పొందేందుకు సదరంలో పేరు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వారు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. శనివారం సదరం సైట్ ఓపెన్ చేశారని ప్రకటించడంతో దివ్యాగులు ఆయా సచివాలయాల వద్దకు అష్టకష్టాల పడి చేరుకున్నారు. తీరా సర్వర్ పనిచేయడం లేదని, సైట్ ఓపెన్ కావడంలేదని చెప్పడంతో వారు తీవ్ర నిరుత్సాహంతో వెనుదిరిగారు. మరో సచివలయం వద్దకు వెళ్లితే అదే సమాధానం రావడంతో తమ బాధలు వర్ణనాతీతమని వారు వాపోయారు. ఆఖరికి ఒక్క అరగంట సేపు ఆన్‌లైన్ సైట్ పనిచేయడంతో వేళ్లపై లెక్కించే విధంగా కొంత మంది పేర్లు నమోదు చేసుకున్నారు. మిగిలినవారంత తీవ్ర మనస్థాపానికి గురై వెనుదిరిగారు. మళ్లీ సదరం సైట్ ఎప్పుడిస్తారోనని ఎదురుచూడాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

కొండచిలువ హతం

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామ శివారు తిమ్మరాజు కాలనీలోకి చొచ్చుకువస్తున్న కొండచిలువను స్థానికులు శనివారం గుర్తించి చంపేశారు. ఆ ప్రాంతంలో కాలువలో పూడిక తీస్తుండగా ప్రక్కనే ఉన్న కాలనీలోకి ప్రవేశించింది. ఇళ్లల్లోకి వస్తుందనే భయంతో స్థానిక యువకులు దానిని చంపివేశారు. పంట కాల్వలు, మురుగు కాల్వల్లో పూడిక తీత పనుల్లో కొండచిలువలు బయటపడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. చేపలు, రొయ్యల చెరువుల సమీపంలో తిరుగుతూ, కాల్వ గట్ల వెంబడి ప్రయాణిస్తూ కోళ్లను తింటున్నాయని చెబుతున్నారు.

టెండర్ దరఖాస్తుల పరిశీలన

భీమవరం (ప్రకాశంచౌక్): శనివారం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లాలోని అన్ని ప్రభుత్వ హాస్పిటల్స్ లో రోగులకు ఆహారం సరఫరా చేసేందుకు వేసిన టెండర్ల దరఖాస్తుల సీల్ డబ్బాను ఓపెన్ చేసి దరఖాస్తుదారుల సమక్షంలోనే క్షుణ్ణంగా పరిశీలించారు. ఫెసిలిటీ వైజ్ టెండర్ దారులుతో మాట్లాడివారితో సమీక్షించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం: మునిసిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని లేకుంటే దశల వారీగా ఉద్యమాలు చేపడతామని మునిసిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, ఎఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు హెచ్చరించారు. మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల హక్కుల సాధనకు చేపట్టిన దశలవారి ఆందోళనల్లో భాగంగా శనివారం భీమవరం మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు, రంగారావు మాట్లాడుతూ మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల అపరిష్కృత డిమాండ్స్ నెరవేర్చాలన్నారు. పదవీ విరమణచేసిన, మృతి చెందిన ఇంజనీరింగ్ కార్మికుల కుటుంబ సభ్యులు, వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు.

రైతు సేవలకు కియోస్క్‌లు దూరం

కూటమి ప్రభుత్వంలో మూలకు చేరిన వైనం

పాలకొల్లు సెంట్రల్: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎంత ఉపయోగపడే పరికరాలైనా, వ్యవస్థలైనా, ఏ కార్యక్రమమైనా సరే మన బ్రాండ్ మాత్రమే ఉండాలి. గత ప్రభుత్వంలో ప్రజలకు ఉపయోగపడిన వ్యవస్థల్లో ఏదైనా సరే మనం కొనసాగిస్తే అది గత ప్రభుత్వం ముద్ర పడుతుంది. అందుకు నాటి జ్ఞాపకాలు ఏవీ కొనసాగకూడదు అంతే. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అనుసరించే నిబంధనలు ఇలానే కనిపిస్తుంది. నాడు అన్నదాతలకు రైతు భరోసా కేంద్రాలు, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేసిన సచివాలయాలు, ఆర్‌బీకేలు, వలంటీర్లు ఇలా అనేక వ్యవస్థలను నీరుగారుస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్నదాతలకు మెరుగైన సేవలు అందించాలనే సంకల్పంతో దాదాపుగా ఒక్కో గ్రామానికి ఒక్కో రైతు భరోసా కేంద్రాలను (ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు) ఏర్పాటు చేశారు. ఆ ఆర్‌బీకేల్లో రైతులకు నిరంతరం సేవలందించడానికి కియోస్క్ డిజిటల్ పరికరాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా అన్నదాతలకు విత్తు నుంచి విక్రయం వరకూ అన్ని విధాలా తోడ్పాటు లభించేది. నేడు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఆ కియోస్క్‌లు అలంకారప్రాయంగా మూలకు చేరాయి.

రైతులకు కియోస్క్‌ల ఉపయోగం

విత్తనం నుంచి పంట విక్రయాల వరకూ అన్నదాతలకు ప్రతీ అడుగులు అండగా ఉంటాయని కియోస్క్‌లను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అవసరమైన రైతులు ఈ కేంద్రాల వద్దకు వచ్చి ఆర్‌బీకే సిబ్బందికి తెలియజేస్తారు. అనంతరం ఆ సిబ్బంది కియోస్క్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో రైతులకు ఏమి కావాలో అవి నమోదు చేయడం ద్వారా ఏ రకం కావాలో అవి రప్పించే పరిస్థితి ఉండేది. అలాగే వాతావరణంలో మార్పులు తెలుసుకుని దానికి అనుగుణంగా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడానికి రైతులకు వెసులుబాటు ఉండేది. పంట ఉత్పత్తుల మద్దతు ధరలు కూడా వీటి ద్వారా రైతులు తెలుసుకునే వారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో రైతు భరోసా కేంద్రాలు రైతు సేవా కేంద్రాలుగా మారినా సేవలు అందించడంలో మాత్రం పూర్తిగా విఫలమయ్యాయి. వీటి సేవలు కొనసాగిస్తే వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎక్కడ పేరు ప్రఖ్యాతలు వస్తాయోననే దురుద్దేశంతో రైతులకు ఎంతో ఉపయోగకరమైన కియోస్క్ సేవలను నీరుగార్చడానికి కూడా కూటమి ప్రభుత్వం వెనుకాడలేదనడానికి మూలకు చేరిన ఈ యంత్రాలే నిదర్శనం. నియోజకవర్గంలో రైతు భరోసా కేంద్రాలు పాలకొల్లు మండలంలో 16, యలమంచిలి మండలంలో 21 మొత్తం 37 ఉన్నాయి. దాదాపుగా చాలా ప్రాంతాల్లో ఇవి పనిచేయకపోవడంతో ఈ యంత్రాలు అలంకార ప్రాయంగా తయారయ్యాయి.



రైతు సేవా కేంద్రంలో మూలకు చేరిన కియోస్క్

అధిక ధరలకు కొనాల్సి ఉంటుంది



రైతు సేవా కేంద్రాల్లో ఉన్న కియోస్క్‌లు ద్వారా ఎరువులు, పురుగుమందులు బుక్ చేసుకునే వాళ్లం. ప్రస్తుతం అవి మూలకు చేరుకోవడం వల్ల బయట మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేసుకోవాల్సి వస్తుంది. దీని వల్ల ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నాం.

– గుడాల సురేష్, రైతు, పెనుమద్రు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని ఆగర్తిపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని ఆగర్తిపాలెం, సగంచెరువు, గొల్లగూడెం ఫీడర్లలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణం సందర్భంగా ఆదివారం విద్యుత్‌కు సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ కె.మధుకుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మండలంలో ఆగర్తిపాలెం, సగంచెరువు, వెలివెల, గొల్లగూడెం, తిల్లపూడి, తిల్లపూడిపాలెం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని స్పష్టం చేశారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

యలమంచిలి: మండంలోని శిరగాలపల్లి గ్రామానికి చెందిన వడ్రంగి మేస్త్రి వెలివెల బ్రహ్మం (50) ప్రమాదవశాత్తు రేకుల షెడ్డు మీద నుంచి పడిపోయి చికిత్స పొందుతూ శనివారం మరణించాడని ఎస్సై కె గుర్రయ్య తెలిపారు. బ్రహ్మం ఈ నెల 1న మేడపాడు గ్రామంలో రేకుల షెడ్డు వేయడానికి పనికి వెళ్లాడు. షెడ్డుపై రేకులు వేస్తుండగా కాలు జారి కింద పడిపోయాడు. వెంటనే అతనిని భీమవరం ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ఈ మేరకు బ్రహ్మం కుమారుడు నిహార్ పిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రామలింగేశ్వరుని అన్నదాన ట్రస్ట్‌కు రూ. 50 వేల విరాళం



దాతకు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ ఈఓ

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామ లింగేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేయనున్న నిత్యాన్నదాన ట్రస్ట్‌కు కాకినాడకు చెందిన దాత ఘరిమెల్ల నాగ వెంకట రవిశంకర్, సీత దంపతులు రూ. 50 వేలు విరాళం అందజేశారు. ఈ మేరకు విరాళాన్ని శనివారం ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాస్‌కు అందజేశారు. అనంతరం దాతను స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ పసుపులేటి వాసు తదితరులు పాల్గొన్నారు.

గోపీని కలిసిన జిల్లా వీవర్స్ ప్రెసిడెంట్



మల్లికార్జునుడిని సన్మానిస్తున్న గుడాల గోపి

పాలకొల్లు సెంట్రల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కష్ట పడి పనిచేసే వారికి ఎప్పుడూ సముచిత స్థానం కలుగుతుందని నియోజకవర్గ ఇంచార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు అన్నారు. శనివారం వైఎస్సార్ సిపి జిల్లా వీవర్స్ విభాగం అధ్యక్షుడిగా ఎంపికైన వీరా మల్లికార్జునుడును అభినందించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ నూతనంగా పదవులు అలంకరించిన ప్రతీ నాయకుడు పార్టీకి క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ప్రారంభమైందని అన్నారు. టీడీపీ నాయకులు గ్రామాల్లో, పట్టణంలో ఇంటింటికీ తిరగడానికి భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో యడ్ల తాతాజీ, జోగాడ ఉమామహేశ్వరరావు, మామిడిశెట్టి చిట్టిబాబు, దేవ రాజేష్, వాసంశెట్టి సుబ్బయ్య, చింతలపాటి మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ఆదాయానికి కూటమి సర్కార్ గండి

- రూ.38.16 లక్షలకు రోజు వారీ మార్కెట్ వేలం జనసేన నేతకు ఖరారు
- కౌన్సిల్ అత్యవసర సమావేశంలో వేలాన్ని ఖరారు చేస్తూ తీర్మానం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీ ఆదాయానికి కూటమి సర్కార్ గండి కొట్టింది. మున్సిపాలిటీలో రోజువారీ మార్కెట్‌కు సంబంధించి పన్నులు వసూలు చేసుకోవడానికి హక్కులు కల్పించేందుకు నిర్వహించిన వేలాన్ని రూ.38.16 లక్షలకు ఖరారు చేశారు. శనివారం నిర్వహించిన కౌన్సిల్ అత్యవసర సమావేశంలో జనసేన నేతకు వేలాన్ని ఖరారు చేస్తూ కౌన్సిల్ తీర్మానం చేసింది. గత ఏడాది మార్కెట్ పాట రూ.72 లక్షలకు వెళ్లింది. అయితే ఈ ఏడాది మార్చి నెలలో నిర్వహించిన వేలాన్ని సదరు జనసేన నేత తక్కువ ధరకు దక్కించుకున్నారు. అయితే మున్సిపాలిటీ ఆదాయం కోల్పోతుందని కౌన్సిల్ తీర్మానం దక్కలేదు. అయితే అప్పటి నుంచి మున్సిపల్ సిబ్బందే పన్నులు వసూలు చేస్తున్నారు. ఎలాగైనా పాట తక్కువకే దక్కించుకోవాలని జనసేన నేత వేసిన పాచికలు ఎట్టకేలకు పారాయి. కౌన్సిల్ ఆమోదంతో 9 నెలల సమయానికి గాను రూ.38.16 లక్షలకే పాట దక్కించుకున్నారు. దాదాపు రూ.30 లక్షలు మున్సిపాలిటీ ఆదాయం కోల్పోయినట్టుయ్యింది.

డీసెంట్ ఇచ్చిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

కేవలం మార్కెట్ పాట విషయంలో నిర్ణయం తీసుకోవడానికి చైర్‌పర్సన్ బర్రి శ్రీ వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ అత్యవసర సమావేశం వాడీవేడిగా సాగింది. మున్సిపాలిటీ ఆదాయం కోల్పోయే విధంగా తక్కువ మొత్తానికి పాటను కట్టబెట్టే ప్రయత్నం తగదని ఆరోపిస్తూ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, కావలి రామసీత ఇద్దరూ డీసెంట్ ఇచ్చారు. ఎవరికీ తెలియకుండా పబ్లిసిటీ లేకుండా ఓ నలుగురు కాంట్రాక్టర్లను మొక్కుబడిగా పిలిచి అధికారులు తూతూమంత్రంగా పాటపెట్టారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాట మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. మరో వైఎస్సార్‌సీపీ సభ్యుడు సఖినేటిపల్లి సురేష్ పాట నిర్వహణ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందు పాట జరిగినప్పుడు జీఎస్టీ ఉందని చెప్పారని, పాటదారులు బయటపడి పాటకు ముందుకు రాలేదన్నారు. ఇప్పుడు జీఎస్టీ లేదని చెబుతున్నారని అన్నారు. జీఎస్టీ లేదని చెప్పి, మళ్లీ మంచిగా ప్రచారం చేసి పాట పెడితే మున్సిపాలిటీ ఆదాయం పెరుగుతుందని అన్నారు. వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని, వంగా శ్రీకాంత్ కన్నా, కోటిపల్లి సురేష్, సిర్రా కాంతమ్మ చర్చలో పాల్గొని మాట్లాడారు. ఓటింగ్ నిర్వహించి పాటను ఖరారు చేస్తూ తీర్మానం చేశారు. అయితే పాట ఖరారు విషయంలో అధికారుల నుంచి, పాటలో పాల్గొన్న గుత్తేదారులు వరకూ భారీగా సొమ్ములు మారినట్టు విమర్శలు వస్తున్నాయి. పాటదారులు విషయంలో కొందరు కౌన్సిలర్లకు కూడా ముడుపులు అందాయనే గుసగుసలు బహిరంగంగానే వినిస్తున్నాయి.

తూతూమంత్రంగా మహిళా సర్పంచ్‌ల శిక్షణ

నరసాపురం రూరల్: మహిళా సర్పంచ్‌ల శిక్షణా కార్యక్రమం దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగాయనే చందంగా ఉందని పలువురు నేతలు విమర్శిస్తున్నారు. సర్పంచ్‌ల కాలం ముగుస్తున్న తరుణంలో ప్రస్తుత ప్రభుత్వం మహిళలకు ఏదో చేసేస్తున్నాం అని చెప్పుకోవడానికి హడావుడిగా శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందని పెదవి విరుస్తున్నారు. గత ప్రభుత్వం పంచాయతీ పాలనా వ్యవహారాల్లో మహిళా సర్పంచ్‌లకు విస్తృతమైన స్వేచ్ఛనిచ్చిందని చెప్పడానికి వారు ప్రాతినిధ్యం వహిస్తున్న పంచాయతీలే నిదర్శనం. ప్రస్తుత పాలకులు తాము కూడా ఏదో చెప్పుకోవడానికి మూడు రోజుల సర్పంచ్‌ల శిక్షణా కార్యక్రమాన్ని తూతూ మంత్రంగా జరిపి శనివారం ముగించారు. మహిళా సాధికారత సాధించడం, స్థానిక స్వపరిపాలన ద్వారా గ్రామీణాభివృద్ధి సాధించడం, పంచాయతీలోని సమస్యల పరిష్కారానికి పలువురితో మాట్లాడే విధానాలపై మూడు రోజులపాటు మాస్టర్ ట్రైనర్లు కళ్యాణి, సరళ, సునీతాదేవి, విశ్వనాథ్, సత్యనారాయణలు శిక్షణను ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో ఎంపీపీ మైలాబత్తుల సోని, డీఎల్‌పీవో జ్యోతిర్మయి, ఎంపీడీవో కార్యాలయ పర్యవేక్షకుడు కె.వీరభద్రరావు, డిప్యూటీ ఎంపీడ్రో కె.నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ను బెదిరిస్తున్న టీడీపీ నాయకుడు



విలేకరుల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేస్తున్న సర్పంచ్ ఇళ్ల చంద్రిక

పెనుగొండ: స్థానిక పంచాయితీ కార్యాలయంలో ఏ పని జరగాలన్నా తనకు చెప్పి చేయాలంటూ గణపతినీడి రాంబాబు అనే టీడీపీ నాయకుడు తనను భయాందోళనకు గురిచేస్తున్నారని పండిత విల్లూరు సర్పంచ్ ఇళ్ల చంద్రిక వాపోయారు. ఈ మేరకు పోడూరు మండలం పండిత విల్లూరు గ్రామపంచాయతీలో శనివారం ఆమె విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణపతినీడి రాంబాబు అనే వ్యక్తి సర్పంచ్ అయిన తనను మీటింగు పెట్టకుండా అడ్డుకుంటూ, పంచాయతీ కార్యకలాపాలకు రావడం లేదంటూ వేధిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ వర్గానికి చెందిన మహిళననే తనపై వివక్ష చూపుతున్నారన్నారు. నాకు చెప్పకుండా ఏ పని చేసినా నీ చెక్ పవర్ కట్ చేయిస్తానని బెదిరింపులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నెలకే గ్రామ పంచాయతీకి కార్యదర్శిగా వచ్చిన వెంకటరెడ్డి సైతనం రాంబాబుకు వత్తాసు పలుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై తాను ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. అయితే ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్తే తమ పార్టీ వాళ్లు చెప్పినట్లు నడుచుకోమంటున్నారని పేర్కొన్నారు. సమావేశంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు గెద్దాడ ఏకలవ్య, ఆచంట ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గుబ్బల వీరబ్రహ్మం, మినీ మినీమించిలిపాడు సర్పంచ్ రామన వీర్రాజు, గుడాల చంటి, వార్డు మెంబర్లు కె.అనంత సత్యనాగేశ్వరరావు, టి.లక్ష్మీశిరీష, కె.శ్రీవాణి, పి.సుమజా, కె.కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌కు విశేష స్పందన



నరసాపురం: లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేస్తున్న దృశ్యం



పాలకొల్లు సెంట్రల్: లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జడ్జి జియావుద్దీన్

నరసాపురం: స్థానిక కోర్టు హాల్లో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. ఈ లోక్ అదాలత్‌లో 320 కేసులు పరిష్కరించినట్టు నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు చెప్పారు. రూ 1.21 కోట్లు మొత్తం కక్షిదారులకు లబ్ధి చేకూరిందని చెప్పారు. మూడు బెంచ్‌లు ఏర్పాటు చేసి కేసులు రాజీ చేశారు. బెంచ్ అధికారులుగా న్యాయమూర్తులు ఆర్.వరలక్ష్మి, ఎస్.రాజ్యలక్ష్మి వ్యహరించారు. ఈ సందర్భంగా జడ్జి గంగరాజు మాట్లాడుతూ రాజీమార్గం రాజమార్గమన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయని చెప్పారు. మీడియా విస్తృత ప్రచారం, పోలీసు శాఖ, న్యాయవాదులు సహకారంతో ఎక్కువ కేసులు రాజీ చేశామని హర్షం వ్యక్తం చేశారు.

పాలకొల్లులో 183 కేసుల పరిష్కారం

పాలకొల్లు సెంట్రల్: జాతీయ లోక్ అదాలత్‌లో 183 కేసులు పరిష్కరించినట్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) షేక్ జియావుద్దీన్ తెలిపారు. శనివారం పట్టణ కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జియావుద్దీన్ మాట్లాడుతూ ఐపీసీ కేసులు 84, చెక్కు బౌన్స్ 7, ఎక్సైజ్ కేసులు 28, ప్రామిసరీ నోట్‌లు 14, మనోవర్తి కేసులు 4, డీవీసీ కేసులు 2, ఎగ్జిక్యూషన్ పిటిషన్ కేసులు 3, బ్యాంకు ప్రిలిటిగేషన్ కేసులు 1, బెంచ్ కోర్టు కేసులు 39 మొత్తం 183 కేసులు పరిష్కరించామని స్పష్టం చేశారు. కక్షిదారులు రూ. 1,32,32,835లు పరిష్కారం పొందారన్నారు. కార్యక్రమంలో అదనపు సివిల్ జడ్జి లక్ష్మీలావణ్య, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్‌వీ సూర్యనారాయణ, న్యాయవాదులు చంటి, పూర్వ రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

నారుమడుల్లో సస్యరక్షణ చేపట్టాలి



గునుపూడిలో నారుమడులను పరిశీలిస్తున్న ఏఓ ప్రసాద్

భీమవరం అర్బన్: నారుమడులలో సస్య రక్షణ చేపడితే నాణ్యమైన నారు వస్తుందని సాగులో చీడపీడల ఉధృతి తగ్గుతుందని మండల వ్యవసాయాధికారి యర్రంశెట్టి ప్రసాద్ సూచించారు. భీమవరంలోని గునుపూడిలో శనివారం మండల ఏవో ప్రసాద్ నారుమడులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 సెంట్ల నారుమడికి 12 -14 రోజుల మధ్య కిలో నత్రజని, కిలో బాస్వరం, కిలో పోటాష్ చల్లాలన్నారు. నారు ఆకు పూర్తిగా విచ్చుకునేవరకు ఆరుతడిగా నీరు పెట్టి తరువాత మడులలో నీటిని నిలువ చేయాలన్నారు. జింకు లోపాన్ని గమనిస్తే లీటర్ నీటికి రెండు గ్రాములు జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలని చెప్పారు. విత్తిన పదిరోజులకు కార్బోఫ్యురాన్ 3 జి గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాములు చొప్పు వేయాలని లేకపోతే మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ., లేక క్లోరి ఫైరిఫాస్ 2.0 మి.లీ లీటర్ నీటికి కలిపి విత్తిన 10, 17 రోజులకు పిచికారి చేయాలి. నారు తీయడానికి 7 రోజులు ముందు సెంటు నారుమడికి 120 గ్రాముల కార్బోఫ్యూరన్ గుళికలు ఇసుకలో కలిపి పలుచగా చల్లాలన్నారు. నారుమడిలో సస్య రక్షణ చేపడితే సాగులో చీడ పీడల ఉధృతి నుంచి తట్టుకుంటుందన్నారు. అనంతరం గునుపూడి సోమేశ్వరాలయం వద్ద కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఏవో ప్రసాద్ వెంట వ్యవసాయ సిబ్బంది, రైతులు ఉన్నారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

భీమవరం: భీమవరం పట్టణంలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో ఏడాది చదువుతున్న విద్యార్థిని కనిపించడంలేదని బాలిక తండ్రి ఫిర్యాదు చేశారని టూటౌన్ పోలీసులు తెలిపారు. శ్రీరామ్ అనే యువకుడితో సన్నిహితంగా ఉండటంతో అతనిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయగా టూటౌన్ ఎస్సై రెహమాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

ఫసల్ బీమా యోజన రైతులకు ఉపయోగం

భీమవరం అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజన పథకం రైతులకు ఎంతో ప్రయజనకరంగా ఉంటుందని తాడేరు పరపతి సహకార సంఘం కార్యదర్శి నందమూరి వెంకట సుబ్బారావు అన్నారు. భీమవరం మండలంలోని తాడేరులో సహకార పరపతి సంఘంలో శనివారం ఫసల్ బీమా యోజన బీమా పథకం గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి నందమూరి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ ఈ పథకాన్ని అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా (కేంద్ర ప్రభుత్వ సంస్థ) పైలట్ ప్రాజెక్టుగా పశ్చిమగోదావరి, విజయనగరం, సత్యసాయి జిల్లాల్లో ప్రవేశపెట్టి అమలు చేయడంతో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. సొసైటీ పరిధిలో రైతులు ఎకరానికి రూ. 210 ఆగస్టు నెల 15 లోపు చెల్లిస్తే ఈ పథకం ద్వారా పంటల బీమా పొందవచ్చన్నారు. రైతులు ఈ పథకానికి ప్రీమియం చెల్లించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా (ఏఐసీ) అసిస్టెంట్ మేనేజర్ సంపత్ కుమార్ నాయక్, జిల్లా కో ఆర్డినేటర్ చక్రధర్, డీసీసీ బ్యాంకు మేనేజర్ తిరుమల రెడ్డి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సహకార దినోత్సవం

వీరవాసరం: గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో సహకార రంగం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుందని జిల్లా సహకార అధికారి సంకు మురళీకృష్ణ తెలిపారు. అండలూరు విశాల సహకార పరపతి సంఘంలో శనివారం నిర్వహించిన 13వ అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు, రైతులకు, కార్మికులకు, వ్యవసాయ కూలీలకు సహకార సొసైటీలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు.ప్రతి ఒక్కరూ సహకార బ్యాంకులను సద్వినియోగపరచుకోవాలన్నారు. సంఘ ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిశుభ్రతను గూర్చి వివరించారు. సహకార ఉద్యమం యొక్క ప్రాధాన్యత గురించి తెలియజేస్తూ సహకార సంఘంపై ప్రత్యేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సబ్ డివిజనల్ కోఆపరేటివ్ అధికారి జి సత్యనారాయణ ,తెలబోయిన శ్రీనివాసరావు, రామదాసు, ఐ హుస్సేన్ ,లింగం శ్రీనివాస్, మమత, ఎల్వి సత్యనారాయణ, యాళ్లబండి శ్రీనివాస్, సంఘ సిబ్బంది ,సంఘ కార్యదర్శులు, రైతులు, పాల్గొన్నారు.